andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 • కనిష్ఠం 19.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 25 డిసెంబరు 2024

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తికి కౌన్సెలింగ్

తానూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తికి ఎస్సై రమేష్, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ప్రాణాన్ని కాపాడారు. వివరాల ప్రకారం... మండలంలోని హిప్నెల్లి తండాకు చెందిన పవార్ వికాస్(28) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. మంగళవారం ఇంట్లో భార్యతో గొడవ పడి క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు వెంటనే పోలీసులకు సమచారం అందించగా, ఎస్సై రమేష్ పరిస్థితిని అర్థం చేసుకొని కానిస్టేబుల్ వాచు, రమేష్, సాయినాథ్‌లతో కలిసి సదరు వ్యక్తిని వెతికి పట్టుకొని, కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.



పంచాయతీ సమరానికి సన్నాహాలు

- 400 సర్పంచ్‌లు, 3368 వార్డు సభ్యులకు ఎన్నిక
- షెడ్యూల్ జారీ కోసం ఎదురుచూపులు
- ఇప్పటికే పోలింగ్ స్టేషన్‌ల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- జిల్లాలో మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు నిర్ణయం
- కొత్తగా ఏర్పడిన నాలుగు పంచాయతీల్లో సైతం
- నోడల్ అధికారుల నియామకం

నిర్మల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ మేరకు పోలింగ్‌స్టేషన్‌ల ఏర్పాటుతో పాటు అన్ని రకాల ఓటర్ల జాబితా ఇతర అన్ని రకాల ప్రక్రియలు పూర్తి చేశారు. ఇక ఎన్నికల సంఘం ద్వారా షెడ్యూల్ జారీ కావడమే తరువాయిగా మిగిలింది. అధికారులు సైతం ఈ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేసి ఎన్నికల తేదీల ప్రకటనల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. నిర్మల్, భైంసా డివిజన్‌లలోని 18 గ్రామీణ, మండలాలకు సంబంధించిన 400 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు. దీని ప్రకారం 400 సర్పంచ్ పదవులు, 3368 వార్డుమెంబర్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. దీని కోసం గానూ 400 గ్రామ పంచాయతీల్లో 3368 పోలింగ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 4,06,219 లక్షల మంది ఓటర్లు పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 200 ఓటర్లు మాత్రమే ఉన్న పోలింగ్‌స్టేషన్‌లు 2889 కాగా 400 ఓటర్లు లోపు ఉన్న పోలింగ్‌స్టేషన్‌లు 435 ఏర్పాటు చేశారు. అలాగే 400 నుంచి 650 వరకు ఉన్న గ్రామ పంచాయతీల్లో 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీని ప్రకారం 3368 పోలింగ్ కేంద్రాలను గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్నారు.

మూడు దశల్లో ఎన్నికలు

కాగా రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి దశలో 136 గ్రామ పంచాయతీలు, రెండోదశలో 131 గ్రామ పంచాయతీలు, మూడో దశలో 133 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నారు. కాగా మొదటిదశలో ఖానాపూర్ మండలంలోని 25 గ్రామ పంచాయతీలుల, పెంబి మండలంలోని 24 గ్రామ పంచాయతీలు, కడెం మండలంలోని 29 గ్రామ పంచాయతీలు, దస్తూరాబాద్ మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, మామడ మండ లంలోని 27 గ్రామ పంచాయతీలు, లక్ష్మణచాంద మండలంలోని 18 గ్రామ పంచాయతీలను ఎన్నికలను నిర్వహించబోతున్నారు. కాగా రెండో దశ కింద నిర్మల్ మండలంలోని 20, సోన్ మండలంలోని 14, సారంగాపూర్ మండలంలోని 32, దిలావర్‌పూర్ మండలంలోని 12, నర్సాపూర్ మండలంలోని 13, లోకేశ్వరం మండలంలోని 25, కుంటాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా మూడో దశ కింద భైంసా మండలంలోని 30 గ్రామ పంచాయతీలు, కుభీర్ మండలంలోని 42 గ్రామ పంచాయతీలు, తానూర్ మండలంలోని 32 గ్రామ పంచాయతీలు, ముథోల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, బాసర మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్‌ల కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు.

కొత్తగా ఏర్పడిన నాలుగు పంచాయతీల్లో సైతం

ఇదిలా ఉండగా గతంలో జిల్లాలో 396 గ్రామ పంచాయతీలుండగా ఇటీవలే మరో నాలుగు గ్రామ పంచాయతీలను అదనంగా ఏర్పాటు చేశారు. ఈ సారి కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల్లో కూడా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. తానూర్ మండలంలోని కల్యాణి, కడెం మండలంలోని న్యూ ధర్మాజీపేట్, ఖానాపూర్ మండలంలోని రంగపేట, కుభీర్ మండలంలోని రంజని తాండలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దీంతో పాటు మైసంపేట, నచ్చనెల్లాపూర్‌లను కూడా గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సర్కారుకు పంపారు.

నోడల్ అధికారుల నియామకం

కాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల వ్యయ పరిశీలన కోసం అడిషనల్ కలెక్టర్‌లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్‌లను అలాగే మ్యాన్ పవర్ నోడల్ అధికారులుగా అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, కలెక్టరేట్ ఏఓ సూర్యారావు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ రత్నాకల్యాణి, కోమల్ రెడ్డిలు నియమింపబడ్డారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణ కోసం డీసీఓ పాపయ్య, సారంగాపూర్ యంపీఓ అబ్దుల్ అజీజ్ ఖాన్, రవాణా విభాగం నోడల్ అధికారిగా డీటీఓ దుర్గా ప్రసాద్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారిగా డిఈఓ రామారావు, మెటిరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా డీపీఓ శ్రీనివాస్, అబ్జర్వర్‌లుగా సీపీఓ జీవరత్నంలను నియమించారు. బ్యాలెట్ పేపర్‌లకు సంబంధించి నోడల్ అధికారులుగా సీఈఓ గోవింద్, ఆర్డీఓలు రత్నాకల్యాణి, కోమల్ రెడ్డిలు, మీడియా కమ్యూనికేషన్ నోడల్ అధికారులుగా డీపీఆర్ఓ విష్ణు, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల నోడల్ అధికారులుగా జిల్లా మైనార్టీ అధికారి మోహన్‌సింగ్, రిపోర్టుల నోడల్ అధికారులుగా ఈ డిస్ట్రిక్ మేనేజర్ నదీం, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్‌లను నియమించారు.



జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు

సేవారత్నం అవార్డులకు
జిల్లా కవుల ఎంపిక

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిబాపూలే మెమోరియల్ ఆర్గనైజర్ విశాఖవారు జిల్లా కవులకు సేవారత్న రాష్ట్ర 2025 అవార్డులను ప్రకటించారు. కవి, ఉపాధ్యాయుడు అంబటి నారాయణ, సామాజిక సాహిత్య సేవకుడు నేరెళ్ల హనుమంతులను ఈ అవార్డులు వరించాయి. ఫౌండర్ ప్రెసిడెంట్ కే. కృష్ణమూర్తి అవార్డులు ప్రకటిస్తూ సమాచారం అందించారు. జనవరి 3న విశాఖ లైబ్రరీలో అవార్డులను అందజేయనున్నారు.

టీఎస్‌యూటీఎఫ్
నూతన కార్యవర్గం ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా పెంట అశోక్ ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, సుజాత ఎన్నికయ్యారు. వివిధ విభాగాలకు కన్వీనర్లు, కార్యవర్గ సభ్యులను నియమించారు.

నేడు పట్టణ స్వర్ణకారుల సంఘ ఎన్నికలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణకారుల సంఘం పట్టణ ఎన్నికలు బుధవారం ఉదయం 9 నుంచి నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు కే. వెంకటస్వామి, కార్యదర్శి కట్ట శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జరిగే ఎన్నికల్లో సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఒకరిపై కేసు

నర్సాపూర్(జి), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గొల్లమాడ గ్రామ పంచాయతీ సెక్రటరీ లోక సంధ్యారాణి, పంచాయతీ సిబ్బంది పిప్పర సంతోష్, లావణ్య, నవీన్‌లు సోమవారం మధ్యాహ్నం సమయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోల్లమాడ గ్రామం నందు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహిస్తున్నారు. కాగా పూసవార్ల తిరుపతి అనే వ్యక్తి అనవసరంగా కల్పించుకొని గ్రామ సెక్రటరీ సంధ్యారాణిని బూతు పద జాలంతో తిడుతూ తన విధులకు ఆటంకపరిచాడన్నారు. దీంతో గ్రామ పంచాయతీ సెక్రటరీ లోక సంధ్యారాణి మంగళవారం నర్సాపూర్(జి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఎస్సై సాయికిరణ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకట స్వామిజీ

బాసర, డిసెంబరు, 24 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో మంగళవారం లక్ష దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. మెదక్ జిల్లాకు చెందిన వెంకట స్వామిజీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వివిధ ఆకృతిలో దీపాలను అలంకరించి వెలిగించారు. ఆలయ ప్రాంగణం, ప్రాకార మండపాలు అన్ని లక్ష దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోయింది.

వినియోగదారుల హక్కులపై
ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్



అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వినియోగదారుడికి హక్కులు, చట్టాలు, న్యాయపరమైన వివరాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. వినియోగదారుడు కొన్న ప్రతి వస్తువుకు రశీదును పొందడం తప్పనిసరి అని అన్నారు. వస్తువుకు క్వాలి టీతో పాటు క్వాంటిటీ కూడా ముఖ్యమేనన్నారు. ప్రజలు వస్తు సేవలను పొందునప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని, వస్తు సేవల నాణ్యత లోపాలపై ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. వ్యాపారస్తులంతా వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, రేషన్ డీలర్లు, వ్యాపారస్తులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహారోత్పత్తి కేంద్రాలతో ప్రయోజనం



చిరుఆహార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఆహార పదార్థాల ఉత్పత్తి కేంద్రాలతో వాటి వినియోగంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టరేట్‌లో చిరు ఆహార కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో కేంద్రాలు నిర్వహిస్తారని తెలిపారు. సేంద్రియ పంటల ఉత్పత్తుల ఆహార పదార్థాల విలువ పెరిగిందన్నారు. వీటిని వినియోగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సేంద్రియ ఉత్పత్తులతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాళ్లను ప్రారంభించడం ద్వారా ఎంతో మంది మహిళలకు మార్గదర్శకంగా నిలుస్తారన్నారు. అధికారులు, ప్రజలు, సిబ్బంది స్టాళ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఏవో అంజిప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో మొదటిసారిగా ఎగ్జిబిషన్ ఏర్పాటు : కలెక్టర్

జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎగ్జిబిషన్ (నుమాయిష్) ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం అధికారులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. జనవరి 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు నిర్వహించాలన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించాలన్నారు. వివిధశాఖల ఆధ్వర్యంలో హస్తకళలు, పెయింటింగ్స్, చేతి వృత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.

కలెక్టర్ అభిలాష అభినవ్

జిల్లా సాంస్కృతిక ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు, తదితర అంశాలపై చర్చించారు. అందరూ కలిసి విజయవంతం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, డీఎస్‌వో కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో
పాల్గొననున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా నుండి 550 మంది రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో జరిగిన పోటల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచారని అభినందించారు. రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను మెరుగైన స్థానంలో నిలపాలని తెలిపారు. విద్యార్థులకు టీషర్ట్‌లు, టోపీలు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, పీఈటీ సెక్రటరీ భోజన్న, పీడీ భూమన్న, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టీషర్ట్‌లు, టోపీలు అందజేస్తున్న కలెక్టర్

రాబోయే వేసవికి విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు

- సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం

నిర్మల్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవి కాలానికి విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రకాల నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం తెలిపారు. ఇందులో భాగంగా గత వేసవికాలం డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పెరగబోయే డిమాండ్ అంచనా మేరకు ప్రణాళికబద్ధంగా అంచనాలు సిద్ధం చేసి సమయానికి అనుగుణంగా తగిన మంజూరును తీసుకుని, కొత్తగా నాలుగు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (పీటీఆర్) ఏర్పాటుకు 33/11 సబ్ స్టేషన్‌లలోని ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. గడిచిన సంవత్సర కాలంగా గరిష్ఠ డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్)పై లోడ్ భారం ఎంత ఉందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకొని అందుకు అనుగుణంగా కొత్త 127 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడం జరుగుతుందని, లోడ్ మేరకు 38 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. మెరుగైన, నాణ్యమైన, విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా అందించడానికి 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్ఠపరిస్తూ ప్రతీ ఒక్క 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి అవసరమైన పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. సర్కిల్ ఓవర్ లోడ్ ఉన్న 33 కేవీ, 11 కేవీ ఫీడర్లను గుర్తించి అందుకు అనుగుణంగా లోడ్ రిలీఫ్ చేయడానికి లోడ్ బదలాయింపు చేస్తున్నామని తద్వారా లోడ్ భారం తగ్గి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు.

మున్సిపాలిటీ టౌన్‌లలో విద్యుత్ అంతరాయాలు సంభవించినప్పుడు అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించడానికి రింగ్ మెయిన్స్ వ్యవస్థను పటిష్ఠపరుస్తూ, 11 కేవీ ఫీడర్లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ల ద్వారా విద్యుత్ వినియోగం చేస్తున్నట్లు తెలిపారు.



ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

సాయిబాబా ఆలయ చైర్మన్‌గా గంగోని బూరాజ్ ప్రమాణ స్వీకారం

నిర్మల్ అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ గండిరామన్న దత్తసాయిబాబా ఆలయ నూతన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగు రవికిషన్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్‌గా గంగోని బూరాజ్, ధర్మకర్తలు మనోజ్‌కుమార్, కత్తిసురేష్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆనంద్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆలయ చైర్మన్‌గా అవకాశం కల్పించిన డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావుకు నూతన చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు. ఇందులో ఆలయ ఈవో రమేష్, దేవరకోట ఆలయ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, నిర్మల్ రూరల్ మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, కొంతం గణేష్, మనోజ్, అయ్యన్నగారి పోశెట్టి, గల్లే రాజన్న, ఆర్. చిరంజీవి, ఓడ్నం నరేందర్, గడ్డంటి ప్రశాంత్, నిమ్మ గణేష్, నాయకులు పాల్గొన్నారు.



బస్టాండ్‌లో క్రిస్మస్ వేడుకలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ బస్టాండ్‌లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శాంటాక్లాస్ వేషధారణలో కేక్‌కట్ చేశారు. ప్రయాణికులు, పిల్లలకు చాక్లెట్లను పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, స్టేషన్ మేనేజర్ ఏఆర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను
పకడ్బందీగా నిర్వహించండి



మస్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సునీత

ఖానాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను ఖానాపూర్ ఎంపీడీవో సునీత ఆదేశించారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు
వాగులో పడి ఒకరి మృతి



మృతదేహాన్ని వాగు నుంచి తీస్తున్న దృశ్యం

లోకేశ్వరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన ఒరు వాగులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం... అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన పడాల నర్సయ్య(42) మంగళవారం ఉదయం 11:30 గంటలకు కనకాపూర్ గ్రామ శివారులోని వాగుకు తోట గంగాధర్ పొలంకు మోటార్ దిపండానికి వెళ్లి కరెంటు మోటార్ వాగులో దించుతుండగా ప్రమాదవశాత్తు మృతుడి చేతికి తాడు చుట్టుకుని ఈత రాక వాగు నీటి లోతు ఎక్కువగా ఉండడం వల్ల మునిగి చనిపోయాడు. మృతుడి భార్య పడాల సాయవ్వ ఫిర్యాదు మేరకు లోకేశ్వరం ఎస్సై అశోక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల సర్వే

(5వ పేజీ తరువాయి...)

చేసేందుకు గంటల తరబడి దరఖాస్తుదారులు, అధికారులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని గ్రామాల్లోనైతే సిగ్నల్ అందుబాటులో ఉన్న ప్రదేశాలకే దరఖాస్తుదారులను పిలిపించుకుని వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలుస్తుంది.

కనిపించని ఆసక్తి

క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేపై దరఖాస్తుదారులు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. అధికారులు అడిగిన వివరాలపై దరఖాస్తుదారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోంది. ప్రస్తుతం గ్రామాల్లో యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పత్తి ఏరే పనులతో పాటు శనగ కలు పు, నీటితడులు అందించడం లాంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వివిధ కారణాలతో దరఖాస్తుదారులు అందుబాటులో ఉండడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే జీర్‌లాక్‌తో అధికారులు సర్వే చేయకుండానే తిరుగుముఖం పడుతున్నారు. ముందస్తు సమాచారం ఉండడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. చాలా గ్రామాలలో పంటల రుణమాఫీ ఎప్పుడు అవుతుందో? చెప్పాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొన్నిచోట్ల సంబంధం లేని ప్రశ్నలతో సర్వే అధికారులతో దరఖాస్తుదారులు వాగ్వాదానికి దిగుతున్నారు. డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్లపై దరఖాస్తుదారుల్లో తీవ్ర నిరాశ కనిపిస్తోంది.

గడువులోగా గగనమే..

ఇందిరమ్మ ఇళ్ల సర్వే గడువులోగా పూర్తికావడం గగనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం నాటికి 40 శాతం సర్వే పూర్తయినట్లు తెలుస్తుంది. సాంకేతిక సమస్యలతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తుంది. జిల్లాలో లక్షా 97వేల 448 దరఖాస్తులకు గాను గడిచిన 9 రోజుల్లో కేవలం 70వేల 345 దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జనవరి 2వరకు సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే సర్వేను పూర్తి చేసేందుకు మరో వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. దీంతో గడువులోగా పూర్తి చేయడం కష్టసాధ్యమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గడువు సమయాన్ని ప్రభుత్వం మరింత పెంచే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశాన్ని ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పించినట్లు తెలుస్తుంది. దీంతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది.

గడువులోగా పూర్తి చేస్తాం

: జితేందర్‌రెడ్డి, జడ్పీ సీఈవో, ఆదిలాబాద్



గడువులోగా ఇందిరమ్మ సర్వేను పూర్తి చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. కొన్ని సాంకేతికపరమైన సమస్యలు ఎదురవుతున్న అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్యలు వస్తున్నాయి. అయిన సర్వేను పూర్తి చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ఆఫ్‌లైన్‌లోను కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో క్షేత్ర స్థాయిలో సర్వేను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు సర్వే నివేదికను అందిస్తున్నాం.

దొంగల పట్టివేత

ఉట్నూర్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొన్ని రోజుల నుంచి వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలను ఉట్నూర్ పోలీ సులు చాకచక్యంగా పట్టుకున్నారు. మండల కేంద్రంలో పక్షం రోజుల నుంచి చోరీలకు పాల్పడిన ఉట్నూర్‌కు చెందిన షేక్‌మోయిన్, షేక్ సాజి ద్, సిందే రాజులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కి పంపినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితులు తాగుడుకు బాని సగా మారి వివిధ రకాల జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్ప డు తున్నారని తెలిపారు. 2.1 తులాల బంగారం, 70 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా పెద్దఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఇలాంటి వ్యక్తి హోం మంత్రి పదవిలో ఉండడం తగదన్నారు. వెంటనే ఆయన మంత్రి పదవి నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, జైనథ్ లక్ష్మి నారాయణ స్వామి కమిటీ అధ్యక్షులు అడ్డి రూకేష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మురికి కాలువ అక్రమ నిర్మాణాన్ని ఆపండి

బోథ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లే రోడ్డు పక్కన నూతనంగా నిర్మిస్తున్న మురికి కాలువ నిర్మాణ పనులను ఆపాలని పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహ దాసు ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందించారు. మురికి కాలువ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని కాలువ నిర్మాణం వెనుక కొంతమంది స్వార్థం ఉందని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేగాక కొంతమంది స్థానికులు జిల్లా కలెక్టర్‌కు సైతం మురికి కాలువ నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలపై నాసిరకం పనులపై కలెక్టర్ ఫిర్యాదు చేయడం జరిగింది.

'పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించండి'

నార్నూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదిక్ పట్టభద్రుల నియోజక వర్గ అభ్యర్థిగా తనను గెలిపించాలని సర్దార్ రవీందర్‌సింగ్ మాజీమేయల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పట్టభద్రులతో కలిసి రాబోయే ఎన్నికల్లో తాను అభ్యర్థిగా నిలబడుతున్న మీరు సహకరించి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలపైన మండలిలో గళం విప్పుతాను పటుభద్రుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తాను. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటాను. ఏ రాత్రి ఫోన్ చేసిన ఫోన్ ఎత్తే అలవాటు నాకు ఉంది. నా సెల్‌ఫోన్ ఇరవై నాలుగు గంటలు అందు బాటులోఉంటుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజక వర్గ పరిధిలో ఉన్న పట్ట భద్రులకు రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తాను. ప్రజల కోసమే పని చేశాను నేను నిత్యం మీ కండ్ల ముందు కదలడేవాడిని ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండి నాదృష్టికి తెచ్చే ప్రతి ప్రజాసమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాను అని సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ తదితరులున్నారు.

సీసీఐ ద్వారా కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లు

ఆదిలాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):సీసీఐ ద్వారా ఎమ్మెస్పీ కింద పత్తి కొనుగోళ్లు ప్రస్తుత పత్తిసీజన్ 2024-25లో కొనసాగుతుంది. పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు సీసీఐ శాఖ కార్యాలయము ఆదిలాబాద్ పరిధిలోని 5 జిల్లాల్లో 24 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

విహారయాత్రకు ఉపాధ్యాయులు

బోథ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధన్నూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విహారయాత్రకు తరలివెళ్లారు. గులాబ్‌సింగ్ ఫిలిం సిటీకి వెళ్లిన విద్యార్థులు ప్రకృతి సౌందర్యాలను తిలకించారు. అటవీ ప్రాంతాలు జలపాతాలు సరస్సులో బోటింగ్ జారుడు, బల్లపైన విద్యార్థులు ఆడి పాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావు ల శంకర్‌తో పాటు పాఠశాల సిబ్బంది రాథోడ్ సవిత ఇయ్యాల స్వప్న, మాడప్రశాంత్ కుమార్, భువనగిరి సారిక పాఠశాల చైర్మన్ శిల్పాంజలి, గంగమ్మ, గుండమ్మలున్నారు.

కొనసాగుతున్న శ్రీ నవచండీ మహాయాగం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి) గ్రామంలో ఏసీపీ వెంకటేశ్వర్ నిర్వహిస్తున్న శ్రీ నవ చండీ మహా యాగాన్ని భక్తిశ్రద్ధలతో కొనసాగుతుంది. మంగళవారం వేద పండితులు ఘనతుల ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన, గణపతి హవనం, మహా మంగళ ప్రద చండి హవనం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. శ్రీ నవ చండీ మహా చేపడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌ను అభినందించారు. అంతకు ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెగ్యులర్ చేయాలని 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట రోడ్డును ఊడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేయడంతోపాటు సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయారని ఆరోపించారు. 15 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్చలు జరిపి తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియాంక, రాజన్న పాల్గొన్నారు.



రోడ్డు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

డీసీసీబీ నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవ త్సరం 2025లో రైతులకు మరింత చెరువయ్యేలా బ్యాంక్ పథకాలను విస్తృతం చేస్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి అన్నారు. మంగళ వారం బ్యాంక్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెం డర్లను ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం వచ్చినప్పుడు 800 కోట్ల బ్యాంక్ లావాదే విలుండేదన్నారు. వచ్చిన తర్వాత 1525 కోట్లలతో కొన సాగుతుందని, మార్చినాటికి 16 నుంచి 17 వందల కోట్లకు తీసుకెళ్లేల లక్ష్యం పెట్టుకున్నామన్నారు. రైతులు రుణాలు తీసుకొని సకాలంలో చెలిస్తే వడ్డీ కూడా తక్కువ పడుతోందన్నారు. బ్యాంక్ ద్వారా ఇండ్లు, వాహనాల రుణాలతోపాటు కొత్తగా రైతులకు కర్షక మిత్ర పథకం ద్వారా రుణాలు అందిస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో గల స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం బ్యాంకులు ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జైనథ్ మండల ఐకేపీ ఏపీఎం నాగుల భగవండ్లు అన్నారు. మంగళవారం మండలంలోని కూర గ్రామంలో ప్రధానమంత్రి, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా మంజూరు అయిన ఫ్లోర్‌మిల్‌ను బ్యాంకు అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కూరగ్రామ మాజీ సర్పంచ్ ఎం.వెంకన్న, కరంజి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌సతీష్‌దేశ్‌పాండే, ఐకేపీ సీసీలు ఎల్టి వెంకట్‌రెడ్డి, జీగం గారాం, టి.శ్రీనివాస్‌రెడ్డి, వీఓఏలు గణేష్, రఫీ, ప్రకాష్, సీడాం మనిషా పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళల కోసం అనేక చట్టాలున్న వాటి గురించి అవగాహన లేక సాయం పొందలేక పోతున్నారని న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళాసంఘాల సభ్యులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మి కుల నిర్మూలన చట్టం, గృహహింస తదితర చట్టాల గురించి తెలిపారు. కేసుల నమోదు న్యాయసాయం ఎలా పొందాలో వివరించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ మహిళలు, బాలికల కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువస్తున్నాయన్నారు. వాటి గురించి అవగాహనలేక న్యాయ సాయం పొందలేకపోతున్నారన్నారు. చట్టాల గురించి తెలియజేయడంతోపాటు ధైర్యం నింపాడానికి అవ గాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్, మహిళా సాధికరత జిల్లా కో-ఆర్డినేటర్ పవర్ యశోద పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగుడికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసిన ఘటన మంగళవారం మండలంలోని అంజీ గ్రామంలో జరిగింది. ఎస్సై దుబ్బాక సునీల్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంజి గ్రామానికి చెందిన గౌడ్‌మలే రాహుల్ (22) కొంత కాలంగా మద్యం తాగుడికి బానిసయ్యాడు. మద్యం తాగి కుటుంబసభ్యులతో గొడవ చేసేవాడు. సోమవారం కూడా మద్యం తాగి ఇంటికొచ్చి కుటుంబ సభ్యులతో చిన్న పాటి గొడవ చేసి వ్యవ సాయ చేనుకు వెళ్లిన రాహుల్ వ్యవసాయ చేన్‌లో ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఇంటికొచ్చాడు. గమనించిన కుటుం బసభ్యులు వెంటనే ప్రైవేట్ వాహనంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీ ఉన్నారు.

సమ్మక్క సారలమ్మ జ్యోస్యం చెప్పి

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



జ్యోస్యం చెబుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో సమ్మక్క సారలమ్మ జ్యోస్యం చెప్పి సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మంగళవారం వారు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కనికరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, విద్యాశాఖలో విలీనం, తదితర డిమాండ్లపై సత్వర నిర్ణయం ప్రకటించాలని ఆశించారు. పీఆర్‌టీయూ నాయకులు నరేంద్రబాబు, రమణారావు, తదితరులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జనసేన నాయకుడు మహేష్ సంఘీభావం తెలుపగా సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన



కొయ్యబొమ్మల తయారీ పరిశీలిస్తున్న విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమ రంగంపై అవగాహన కోసం స్థానిక విజయ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం నిర్మల్‌లోని పలు జిన్నింగ్ మిల్లులను సందర్శించారు. వస్త్రాల తయారీకి ఉపయోగపడే పత్తి ఎలా తీస్తారో తెలుసుకున్నారు. అనంతరం నిర్మల్ కొయ్య బొమ్మలను సందర్శించారు. వివిధ పక్షులు, పెయింటింగ్, కూరగాయలు, పండ్లు తయారు చేసిన కళాకారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు వారి వెంట ఉన్నారు.

ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సు

లోకేశ్వరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలో మంగళవారం ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సును ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు, ప్రీ యూనిక్ ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధి మాట్లాడారు. ఆయిల్ ఫామ్ పంటపై చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై క్లుప్తంగా వివరించారు. ప్రీ యూనిక్ ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధి, భైంసా డివిజన్ ఉద్యానశాఖ అధికారి జావిద్ పాషా మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా ఉన్న రాయితీ వివరాలు, సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల గురించి తెలియజేశారు. ఆయిల్‌ఫామ్‌లో పెట్టిన మొదటి సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం వరకు వచ్చిన పూత గెలలను తొలగించాలని తెలియజేశారు. మూడు సంవత్సరాలు పూర్తి అయిన తోటలో వచ్చే సంవత్సరం క్రాప్ వస్తాయి. ఆయిల్‌ఫామ్ పంటలకు వచ్చే చీడపీడలు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ ఆడెపు శేఖర్, ఆయిల్ ఫామ్ క్లస్టర్ ఆఫీసర్ మోహిన్ మియ్యా సంతోష్, రైతు కే. దేవేందర్, విఠల్, లక్ష్మణ్, సాయన్న, బాసర, ముథోల్, లోకేశ్వరం మండలాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి మంత్రుల హామీ

భైంసా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి, అవసరమైన అభివృద్ధి పనుల మంజూరికి రాష్ట్ర పలువురు మంత్రులు స్పష్టమైన హామీనిచ్చినట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయా శాఖల మంత్రులను వారి వారి పేషీల్లో కలిసి అందించిన వినతులకు సానుకూలంగా స్పందించినట్లుగా వివరించారు. బాసర ఆలయాభివృద్ధి, వెనక్కు వెళ్లిన నిధులు, అవసరమైన నిధులు. వసతులు, సౌకర్యాలు , రాబోయే గోదావరి పుష్కరాల పనుల విషయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లినట్లుగా తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారం, అవసరమైన అభివృద్ధి, పుష్కరాల ఏర్పాట్లకు అవసరమైన నిధులు కేటాయించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లుగా తెలిపారు. భైంసా ఏరియా ఆసుపత్రి పడకల సంఖ్య 100 నుంచి 150కు పెంచేందుకు , కుంటాల మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు వైద్యారోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజ నరసింహ హామీనిచ్చినట్లుగా పేర్కొన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువల ఆధునీకరణతో పాటు పల్సికర్ రంగారావ్ ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీటి వ్యవస్థ మెరుగుదలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సత్వరమే చర్యలు తీసుకుంటానని పేర్కొన్నట్లుగా తెలిపారు. ఎస్ఆర్ఎస్‌పీ పునరావాస గ్రామాలవాసులకు భూభారతి అమలులోకి వచ్చిన తదుపరి అర్హులైన వారందరికి పట్టా పత్రాలు అందింపచేస్తానని రెవెన్యూశాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారని వివరించారు.

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్



ముథోల్ [illegible] వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్ సమ్మతించినట్లుగా వెల్లడించారు. కుభీర్, పల్సి, మహాగాం, కోలూర్ కేంద్రాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటు విషయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించిన ఆయా ప్రాంతాల్లో వాటి ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు హామీనిచ్చినట్లుగా వెల్లడించారు. ఇదే క్రమంలో జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు సీతక్కకు నియోజక వర్గ పరిధిలోని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలకు స్వంత భవనాలు నిర్మింప చేయాలని, బాసరలో ఎంపీడీవో కార్యాలయాన్ని నిర్మింపచేసేందుకు నిధుల కేటాయించాలని చేసిన విజ్ఞప్తి మేరకు అంగీకరించినట్లుగా వివరించారు.వీటితో పాటు నియోజక వర్గ పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులను మంత్రి సీతక్క దృష్టికి తీసుకవెళ్లగా ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరింపచేసేందుకు హామీనిచ్చిందని తెలిపారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, బీజేపీ ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్, వెంగళ్‌రావ్, సుమన్, మోహన్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్న జంట అరెస్టు

● ఆలయాలు, తాళం వేసిన ఇళ్లే టార్గెట్ ● విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏఎస్పీ అవినాష్ కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు

భైంసా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జల్సాల కోసం డబ్బులు సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను (సహజీవనం సాగిస్తున్న జంట) పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని పోలీస్ డివిజన్ కార్యాలయంలో ఏఎస్పీ అవినాష్ కుమార్ విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. భైంసా పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన పులిప్రదీప్‌కు రెండేళ్ల క్రితం వెంకటలక్ష్మీ అనే మహిళ పరిచయమై సహజీవనం సాగిస్తున్నారు. సినిమాలు, షికార్లు చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డ వీరిద్దరికి డబ్బులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో అక్రమార్గాల్లో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న ఈ జంట ఇందుకు దొంగతనాలు చేయడం మార్గంగా ఎంచుకున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాలు, తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్‌గా చేసుకొని చోరిలకు పాల్పడుతున్నారు. తాజాగా ఈ నెల 22న (ఆదివారం) అర్ధరాత్రి కారులో కుభీర్ మండలం పార్డి (బీ) గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో చొరబడి హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అక్కడి నుండి అదే మండలంలోని చొండి గ్రామంలో గల శ్రీ దత్తసాయి ఆలయంలో చోరీ చేయగా.. అక్కడ ఏమి దొరకకపోవడంతో గ్యాస్ సిలిండర్‌ను అపహరించకుని మహారాష్ట్రకు వెళ్లిపోయారు.

మరుసటి రోజైన 23 న (సోమవారం) వేకువజామున భైంసాకు కారులో వస్తుండగా కుభీర్ శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరుపగా.. పులి ప్రదీప్, వెంకటలక్ష్మీలు పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరిపై ముథోల్, బాసర, కుభీర్, భైంసా, నర్సాపూర్ (జీ)లోని పోలీసుస్టేషన్‌లలో 8 కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన వీరు జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏఎస్పీ అవినాష్‌కుమార్ వెల్లడించారు. వీరి వద్ద నుండి రూ. 10,910 నగదుతో పాటు ఒక కారు, రెండు సెల్ ఫోన్‌లు, రెండు పుస్తెలు, కాళ్ల పట్టీలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనాల కేసులకు సంబంధించి మరింత రికవరీ చేయాల్సి ఉందని తెలిపారు. నిందితులు పులి ప్రదీప్, వెంకటలక్ష్మీలను రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఈ కేసును చేధించిన భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై రవీందర్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ జానకీ షర్మిలా, ఏఎస్పీ అవినాష్ కుమార్‌లు అభినందించారు.

సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలి

నిర్మల్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సీపీఎం నాలుగవ రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో జరుగుతాయని వాటిని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ అన్నారు. పట్టణంలో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ... సీపీఎం కష్ట జీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి తొడసం శంభు, పోశెట్టి, ఫసిఉద్దీన్, భీమ్‌రావు, ఆనంద్‌రావు, సూర్యభాను, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి)లో ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్

నర్సాపూర్(జి), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్(జి) మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ మాట్లాడుతూ... గత 15 సంవత్సరాలుగా సమత ఫౌండేషన్ చేస్తున్న సేవలను వివరిస్తూ జిల్లాలోని నర్సాపూర్(జి) మండల పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని నిరుపేద కుటుంబాలను, దివ్యాంగులను, వికలాంగులను, మధ్యలో చదువు మానేసిన పేద కుటుంబాలను ఆదుకుంటున్నామని అలాగే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అలాగే పేద కుటుంబంలో ఉన్న క్రీడాకారులను సమత ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామన్నారు. ఈ టోర్నమెంట్‌లోని క్రీడాకారులు స్నేహ పూర్వకంగా ఆడి టోర్నమెంట్‌ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సాయికిరణ్, ఆర్ఐ వేణుగోపాల్, గజేందర్, సమత ఫౌండేషన్ ఆర్గనైజర్ సాహెబ్‌రావు, సీఈవో అనిల్ కుమార్, పీఆర్‌వో క్రాంతికుమార్, టోర్నమెంట్ మేనేజర్ భూమారెడ్డి, వాజిద్, సాజిద్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ పండ్‌తో బాధిత కుటుంబాలకు బాసట

భైంసా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన బాధిత కుటుంబాలకు వ్యయ భారం తగ్గించేందుకు గాను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాసటగా నిలుస్తున్నామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం భైంసాలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో మాజీ ప్రజా ప్రతినిధులు బాశెట్టి రాజన్న, శంకర్ చౌహన్, రమణారెడ్డి, శంకర్ చౌహన్, హైమద్‌పాషా, సాయినాథ్, తాన్సింగ్,సురేష్,రమేష్, అంజనేయులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఖానాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షురాలు బి. లక్ష్మీ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుండి తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో తెలంగాలణ తల్లి విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి అక్కడి నుంచి తిరిగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరవధిక దీక్ష స్థలానికి చేరుకున్నారు. అనంతరం లక్ష్మీ మాట్లాడుతూ... మధ్యాహ్నం భోజనం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నారాయణ, మధ్యాహ్న భోజన యూనియన్ ఖానాపూర్ మండల కార్యదర్శి విజయ, నాయకులు పద్మ, రాజేశ్వరి, మంగ, భాను, మంజుల, నర్సవ్వ తదితరులున్నారు.

తానూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రం తానూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తావద్ద నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజనం కార్మికులున్నారు.


ఐటీడీఏ గేటు వద్ద బైఠాయించిన తుడుందెబ్బ నాయకులు

తుడుందెబ్బ ర్యాలీతో
ఐటీడీఏ వద్ద ఉద్రిక్తత

● గిరిజన పిల్లలకు న్యాయం చేయాలంటూ బైఠాయింపు

ఉట్నూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ముందు సీఆర్‌టీలు తలపెట్టిన సమ్మెతో తమ పిల్లల విద్యాభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయనిపేర్కొంటూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. కొమురంభీం ప్రాంగణం నుంచి ఐటీడీఏ వరకు ఆదివాసులు ఆదివాసీ సంస్కృతి వాయిద్యాలతో ర్యాలీగా తరలివచ్చారు. ఐటీడీఏలోనికి చొచ్చుకు వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఐటీడీఏ వద్దకు డీఎస్పీ చేరుకొని శాంతియుతంగా అధికారులకు సమస్యలు తెలపాలని గిరిజనులను కోరారు. అక్కడ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసు భద్రతను పెంచారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఇక్కడికి రావాలని, వచ్చేవరకు కదిలేదిలేదని పేర్కొంటూ ఆదివాసులు గేటు ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా తుడందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడంగణేష్ మాట్లాడుతూ సీఆర్టీల సమ్మెతో గిరిజన విద్యార్థులకు నష్టం ఏర్పడుతుందని ప్రభుత్వం వెంటనే సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనట్లయితే రానున్న సోమవారం జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ముందు తుడందెబ్బ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. విడతలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావు, కనకరాజు, పంద్రాహనుమంతు, కుడిమెత తిరుపతి, లలితబాయి, పుష్పరాణి, త్రియంబక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● సమ్మె పరిష్కారానికి కృషి

సీఆర్టీల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తున్నానని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా హామీఇచ్చారు. తుడం దెబ్బ నాయకుల నుంచి మెమోరాండం స్వీకరించారు.


నాయకుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న పీఓ ఖుష్బుగుప్తా




నేడు క్రిస్మస్

● పండుగ కోసం చర్చీల ముస్తాబు

ఉట్నూర్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల పండుగ క్రిస్మస్ పురస్కరించుకొని ఏజెన్సీలోని క్రైస్తవులు చర్చీలను ముస్తాబు చేశారు. యేసుకు నామస్మరణతో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడానికి క్రైస్తవులు తమ ప్రార్థనా మందిరాలను రంగురంగుల దీపాలతో అలంకరించారు. ఉట్నూర్ పట్టణంలోని సీఎస్ఐ చర్చీ, క్యాథలిక్ చర్చీతోపాటు లక్కారంలోని బేతస్థ చర్చీలను రంగురంగుల దీపాలతో అలంకరించి బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

← ఉట్నూర్‌లోని క్యాథలిక్ చర్చీ

లక్కారంలోని బేతస్థ చర్చీ →


పండుగ సంబురం


కేక్‌కట్ చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణం రాజరాజేశ్వరగార్డెన్‌లో సోమవారం రాత్రి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరై కేక్‌కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కరుణామయుడు యేసును అనుసరించాలని ఆకాంక్షించారు. పండుగను పవిత్రంగా నిర్వహించుకోవాలన్నారు. నాయకులు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సరికెల గంగన్న, సత్యనారాయణగౌడ్, ముత్యంరెడ్డి, సత్యం చంద్రకాంత్, తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్‌లో ముస్తాబైన చర్చీలు

ఆదిలాబాద్‌రూరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): యేసు జన్మదినం క్రిస్మస్ వేడుకలకు ఆదిలాబాద్ పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ఈనెల 25, 26వ తేదీల్లో క్రిస్మస్ సంబరాలు జరగనుండగా అందుకోసం ఆయా చర్చీల్లో క్రైస్తవ మందిరాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చీల్లో యేసు జనన వృత్తాంతాన్ని వివరిస్తూ బొమ్మల కొలువులను అందంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ప్రార్థనల కోసం చర్చీల్లో ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. చర్చీల ఆవరణలో రంగురంగుల విద్యుత్ దీపాలతో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటుచేయగా ఇరీస్ లైట్ల వెలుగులో సాయంకాలం చర్చీలు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. వినాయక్ చౌక్‌లోని రోమన్ క్యాథలిక్ చర్చీతోపాటు రవీంద్రనగర్ సీఎస్ఐ చర్చీల్లో జరిగే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

జిల్లాకేంద్రంలోని పలు పాఠశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక లిటిల్ స్టార్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ కమలాకర్ రెడ్డి విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, శాంటా క్లాజ్ వేషధారణ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలలో కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ కమలాకర్‌రెడ్డి

భైంసాలో క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

● ముస్తాబైన చర్చీలు

భైంసా, డిసెంబరు 24: డివిజన్ పరిధిలోని చర్చీలు బుధవారం జరిగే క్రిస్మస్ డే వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆయా చర్చీలకు చెందిన ఫాదర్‌లు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. డివిజన్ పరిధిలోని ఎడ్‌బిడ్, తరోడా, కుభీర్, భైంసాలలోని చర్చీలలో క్రిస్మస్ డే వేడుకలను పురస్కరించుకొని బుధవారం మధ్యాహ్నం 12గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. క్రిస్మస్ డే వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించేందుకుగాను క్రైస్తవులు ఒకరోజు ముందు నుంచే ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. తమ ఇళ్లలో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటుచేసి వాటికి విద్యుత్ దీపాలతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. గురువారం క్యారెల్స్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా భైంసాలోని పిప్రి కాలనీ పరిధిలో గల జీసెస్ మిరాకిల్ చర్చీ ఫాదర్ సంతోష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవుల ఇళ్లకు వెళ్లి యేసు క్రీస్తు జన్మము, జీవిత చరిత్ర గురించి వివరిస్తూ అర్ధరాత్రి వరకు ప్రార్థనలు చేపట్టారు.


విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ఏర్పాటుచేసిన క్రిస్మస్‌ట్రీ


విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ఏర్పాటుచేసిన క్రిస్మస్‌ట్రీ

భక్తి


అయ్యప్ప హరిహర క్షేత్రంలోని ఆలయాలు

అభినవ శబరిమల హరిహర క్షేత్రం

- 11 దేవాలయాలతో విరాజిల్లుతున్న నిర్మల్ మల్లన్నగుట్ట ● 27 ఏళ్లుగా వైభవంగా పూజా కార్యక్రమాలు
- అయ్యప్ప దీక్షా సమయంలో ఆలయ ప్రాంగణంలోనే 150 మంది స్వాముల సన్నిధానం
- ప్రతీ యేడు ఆలయ ప్రాంగణంలో సుమారు 400పైగా సత్యనారాయణ స్వామి వ్రతాలు
- గణపతి, సుబ్రహ్మణేశ్వర స్వామి కటాక్షం కోసం ప్రతీ మంగళవారం వేల సంఖ్యలో భక్తుల రాక
- ఈ ఏడాది దివ్య పదునెట్టాంబడికి ముస్తాబవుతున్న హరిహర క్షేత్రం
- 27న మండల పూజా మహోత్సవం





నిర్మల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చనిచెట్ల నడుమ ఎత్తైనకొండపై వెలసి వచ్చిపోయే భక్తులకు ఆధ్యాత్మికంతోపాటు ఆహ్లాదాన్ని అందజేస్తూ నిత్య పూజలతో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న నిర్మల్‌లోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట ప్రాంగణంలో ఉత్తమ తెలంగాణ ప్రాంతంలో అభినవ శబరిమలగా గుర్తింపు పొందుతోంది. పురాతన మల్లన్న స్వామి ఆలయం కలిగిన ఈ గుట్ట ప్రాంతంలో అయ్యప్పస్వామి సహా మరో 10 దేవాలయాలను నిర్మాణం చేపట్టిన నాటి నుంచి నేటివరకు రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ క్షేత్రం ప్రాంగణంలో 11 దేవాలయాలు నిలయమై ఉండడంతో ఈఆలయ ప్రాంగణానికి నిత్యం భక్తులు రాకపోకలు కొనసాగుతున్నాయి. ప్రతీ ఏడాది డిసెంబరు 1 నుంచి జనవరి 13 వరకు ఆలయ ప్రాంగణంలో నిత్యఅన్నదానం కొనసాగుతోంది. అయ్యప్పదీక్షా సమయంలో దీక్ష స్వాములతోపాటు సాధారణ భక్తులు ఎంతమంది వచ్చినా లేదనకుండా భోజనం పెట్టడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. ప్రతీ ఏడాది డిసెంబరు మాసంలో 27న మండల పూజామహోత్సవ వేడుకలను కన్నుల పండుగగా హరిహర క్షేత్రంలో నిర్వహిస్తారు. ఈ ఏడాది సైతం డిసెంబరు 27వ తేదీన మండల పూజా మహో త్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్ల ను పూర్తిచేస్తున్న వేళ హరిహర క్షేత్రం మల్లన్న గుట్టపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

11 దేవాలయాలకు నిలయంగా మల్లన్న గుట్ట

ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చే అభినవ శబరిమలగా గుర్తింపు పొందిన మల్లన్నగుట్ట ప్రాంతంలో పురాతన మల్లన్న స్వామి ఆలయం ఉండేది. ఈ గుట్టపై మల్లన్నతో పాటు గ్రామ దేవతలు కొలువై ఉండేవారు. 1993లో మల్లన్నగుట్ట క్షేత్రంపై అయ్యప్పస్వామి ఆలయంతోపాటు మరో పది ఆలయాలను నిర్మించాలని అల్లోల నారాయణరెడ్డి, చిన్నమ్మల ఏడుగురు సంతానం నిర్ణయించుకొని అదే ఏడాది ఆలయాల నిర్మాణాలకు భూమి పూజచేశారు. మల్లన్న గుట్టపై 1997లో పుష్పగిరి పీఠాధిపతి విద్యానృసింహ భారతిచేతుల మీదుగా గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్ రెడ్డిలు అత్యంత వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. అప్పటి వరకు మల్లన్నగుట్టగా పిలవబడిన ఈ క్షేత్రం హరిహర క్షేత్రం మల్లన్న గుట్టగా పేరుగాంచింది. ఈ ప్రాంగణంలో అయ్యప్ప ఆలయంతో పాటు మరో 10 ఆలయాలు నిలయమై ఉన్నాయి. హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయం, శివాలయం, సత్యనారాయణ స్వామి ఆలయం, గణపతి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, లలితా పరమేశ్వరి ఆలయం, నాగదేవత ఆలయం, మాలిక పురోత్తమ ఆలయం, ఆంజనేయస్వామి దేవాలయం, నవగ్రహాలు, మల్లన్న స్వామి ఆలయాలు నిర్మితమయ్యాయి.

మండల పూజా మహోత్సవానికి ముస్తాబు

గత 27ఏళ్లుగా ఆలయ ప్రాంగణంలో డిసెంబరు 27న మండల పూజా మహోత్సవం వేడుకలు అత్యంత వైభవంగా సాగుతాయి. ఈ వేడుకలకు ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది సైతం నిర్వహించనున్న మండల పూజా మహోత్సవం దివ్య పదునెట్టాంబడికి హరిహర క్షేత్రం ముస్తాబవుతోంది. మండల పూజామహోత్సవం ఏర్పాట్లను ఆలయ కోశాధికారి సామల వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. అత్యంత కన్నుల పండుగగా సాగే మండల పూజామహోత్సవ వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు వేణుగోపాల్‌రెడ్డి చెబుతున్నారు.

మండల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తాం..

● అల్లోల మురళీధర్‌రెడ్డి, హరిహర క్షేత్రం మల్లన్నగుట్ట ధర్మకర్త



గత 27 ఏళ్లుగా నిర్వహిస్తున్న విధంగా ఈ ఏడాది కూడా మండల మహోత్సవం ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. అందుకు కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నాం. మండల పూజా మహోత్సవానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇక్కట్లు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

ఆదివాసీలకు వైద్యసేవలు అందించాలి : ఐటీడీఏ పీవో

నార్నూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా స్పెషలిస్టు వైద్య శిబిరం ఏర్పా టు చేశామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా కోరారు. పీవో మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని చిత్తగూడ గ్రామంలో డయాబెటీస్, బీపీ, గర్భవతులకు రక్తహీనత లేకుండా పౌష్టిక ఆహారం, ఐరన్ టాబ్లెట్‌లను తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ద్వారా ఆరోగ్యకేంద్రానికి, రిమ్స్ ఆదిలాబాద్, హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలకు పంపించేందుకు ప్రత్యేక అంబులెన్స్‌ల సౌకర్యం ఉందని గ్రామపెద్దల సహకా రం తో ఆసుపత్రికి వెళ్లేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. డైట్ మెను ప్రకారమే పిల్లలకి పౌష్టికాహారం అందించాలని అన్నారు. రక్తహీనత నివారణ కోసం అమ్మాయిలకు పోషక విలువ గల మొవ లడ్డు, రాగి మల్తా, గుడ్లు ఇవ్వాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లావైద్యాధికారి డా.నరేందర్‌రాథోడ్, తదితరులు ఉన్నారు.

28న కేబీ ప్రాంగణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా

ఉట్నూర్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి యువకుల కోసం ఈనెల 28న ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు ఏడు కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని 1031 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీ4ఎస్ సెక్యూరిటీస్‌లో 10వ తరగతి చదువు కున్న వారికి 170 ఖాళీలు ఉన్నాయని 17 వేల నుంచి 20 వేల వేతనం ఉంటుందన్నారు. అపోలో ఫార్మసిలో ట్రైనిఅసిస్టెంట్లుగా పదోతరగతి ఇంటర్మీడియట్ చదువుకున్న వారి కోసం 100 ఖాళీలున్నాయని 14వేల నుంచి 25వేల వరకు జీతభత్యాలుంటాయన్నారు. ఎంపవర్మెంట్ సర్వీస్‌లో 75 ఖాళీలున్నాయన్నారు. 18 నుంచి 32 ఏళ్ల లోపు వారు ఉదయం 10 గంటల నుంచి వైటీసీ ఆవరణలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని పీవో ఖుష్బుగుప్తా కోరారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భిక్ష

బోథ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని అయ్యప్ప సన్నిధానంలో సోమ వారం మధ్యాహ్నం అయ్యప్ప భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలిరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. చలి కాలంలో అయ్యప్ప మాలధారణ వల్ల ఆరోగ్యం మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నాగరాజు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన భిక్షలో పలువురు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.


పూజాకార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నేరడిగొండ, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు అనుష్క, జ్యోతిలు సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జి.అంబారావ్ తెలిపారు. శనివారం మంచిర్యాలలో జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఈనెల 27న ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు జి.అంబారావు, పి.గణేష్‌లతో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్

జైనథ్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరాల సావాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ అర్హులైన లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను స్వయంగా ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో జైనథ్ ఎంపీడీవో రవీంద్రనాథ్, తహసీల్దార్ శ్యాంసుం దర్, జైనథ్ ఎంపీఈవో జి.వెంకట్‌రాజ్ సావాపూర్, నిరాల, గ్రామ కార్యదర్శులు సోనాలి, అప్సర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా చేపట్టాలి..

తలమడుగు : ఇండ్లు లేని నిరుపేదల కోసం ఇల్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని తలమడుగు, డోర్లి గ్రామాల్లో అధికారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే ఆన్‌లైన్ యాప్‌డౌన్‌లోడ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటి సర్వేపనులను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అధికారులు ఇంటికి వెళ్ళినప్పుడు లబ్ధిదారులు ఇంటికి సంబంధించిన పూర్తివివరాలు అధికారులకు తెలియజేయాలన్నారు. సొంత స్థలం, ఇంటి నమూనా వివరాలు, ఇంటికి సంబం ధించిన పేపర్లు, ఇంటి పన్ను చెల్లించిన రసీదులు ఆధార్ కార్డు వివరాలు, దరఖాస్తు వివరాలు తెలియపరచాలని సూచించారు. సర్వే సమయంలో ఆన్‌లైన్‌లో ఎలాంటి ఇబ్బందులున్నా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ నమోదు కాని వివరాలు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

'ఇందిరమ్మ' సర్వే..

నత్తనడకన



- జిల్లాలో 1,97,448 ఇందిరమ్మ దరఖాస్తులు
- పల్లెల్లో సిగ్నల్స్ అందక.. మొరాయిస్తున్న సర్వర్
- దరఖాస్తుదారులు అందుబాటులో లేక ఇక్కట్లు
- జనవరి 2వరకు పూర్తి చేయాలంటూ ఆదేశాలు
- ఇంటింటి సర్వేపై ప్రత్యేక దృష్టిని సారించిన కలెక్టర్

ఆదిలాబాద్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే జిల్లాలో అనుకున్నంత స్థాయిలో ముందుకు సాగడం లేదు. వివిధ కారణాలతో చాలా నెమ్మదిగా సాగుతునట్లు తెలుస్తుంది. క్షేత్ర స్థాయి లో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పథకం అమలును పారదర్శకంగా చేపట్టి అసలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. డిసెంబరు 5న ఇందిరమ్మ యాప్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వం.. దానిని అందుబాటులోకి తీసుకొచ్చింది. డిసెంబరు 7 నుంచి దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా.. కొంత ఆలస్యంగా డిసెంబరు 15 నుంచి ఇందిరమ్మ సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యింది. అయితే మొదట పంచాయతీ కార్యదర్శులు సర్వే విధులకు హాజరయ్యేందుకు ఆసక్తి చూపకపోవడంతో మరింత ఆలస్యమయ్యింది. జిల్లాలో లక్షా 97 వేల 448 ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. మొదటి విడతలో ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాకు సుమారుగా 10వేల వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే అవకాశం కనిపిస్తోంది. కానీ దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా రావడంతో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. జిల్లాలో గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రత్యేకదృష్టిని సారించారు. నిత్యం గ్రామాల వారీగా విస్తృతంగా పర్యటిస్తూ సర్వే వివరాల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలిస్తున్నారు.

సర్వేకు సాంకేతిక సమస్యలు

ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా సిగ్నల్ సమస్యతో సర్వర్ మొరాయిస్తూ సైట్ అందుబాటులోకి రావడం లేదని అధికారులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సర్వర్ మొరాయించడంతో సర్వే కొద్దిసేపు నిలిచి పోయింది. రోజుకు ఒక్కో అధికారి 50 వరకు దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా.. కేవలం 20లోపు దరఖాస్తులను మాత్రమే అతికష్టం మీద పూర్తి చేస్తున్నట్లు తెలుస్తుంది. ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు గ్రామాల్లోనే మకాం వేస్తున్న సర్వే పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదంటున్నారు. జిల్లాలో ఎక్కువగా మారుమూల గిరిజన గ్రామాలే ఉన్నాయి. దీంతో నెట్‌వర్క్, సిగ్నల్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. జిల్లాలో వందకు పైగా గ్రామాల్లో నెట్‌వర్క్, సిగ్నల్ అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. సర్వర్ సమస్యలతో ఒక్కో దరఖాస్తు వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు

(తరువాయి 6వ పేజీలో...)

మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల వివరాలిలా.. (23-12-2024 నాటికి)

మండలం పేరు	వచ్చిన దరఖాస్తులు	పూర్తయినవి
ఆదిలాబాద్ మున్సిపాలిటి	31,153	10,384
ఆదిలాబాద్‌రూరల్	11,392	5,258
బజార్‌హత్నూర్	8,797	2,837
బేల	12,083	6,283
భీంపూర్	7,433	3,643
బోథ్	13,056	4,424
గాదిగూడ	6,474	3,361
గుడిహత్నూర్	9,514	3,693
ఇచ్చోడ	12,874	3,418
ఇంద్రవెల్లి	11,687	4,638
జైనథ్	15,476	4,280
మావల	1,505	869
నార్నూర్	8,714	2,604
నేరడిగొండ	8,902	3,685
సిరికొండ	5,470	1,529
తలమడుగు	10,551	2,657
తాంసి	4,852	2,230
ఉట్నూర్	17,515	4,552
మొత్తం	1,97,448	70,345

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందని ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని చాందూరి గ్రామపంచాయతీ పరిధిలోని నీలగొంది గ్రామంలో పర్యటించి రూ.25లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురికికాలువలు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల కాం గ్రెస్ పార్టీ అధ్య క్షుడు ఖయ్యుం, సింగిల్ విండో చైర్మన్ ఎస్సీ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహ మ్మద్ ఎక్బాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు బెల్లూరిమదన్‌రావు, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే సత్ఫలితాలు...

గొప్పలక్ష్యం పెట్టుకొని కష్టపడేతత్వాన్ని అలవర్చుకున్న వారికి సత్ఫలితాలు లభిస్తాయని ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని బీఎడ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఎడ్ కళాశల ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జైనథ్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జైనథ్‌లో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అధికారులు నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 58 మంది లబ్దిదారులకు రూ.లక్షా 116 చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ మండల డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, బీజేపీ జైనథ్ మండల అధ్యక్షులు కట్కం రాందాస్, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు ఎల్టి అశోక్‌రెడ్డి, నాయ కులు ఎన్. ప్రతాప్‌యాదవ్, సామరమేష్ రెడ్డి పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన సీఆర్టీల సమ్మె

ఉట్నూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్ల నిరవధిక సమ్మె ప్రారంభమై మంగళవారం 9వ రోజుకు చేరింది. ప్రజా సంఘాల నాయకులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గ్రామీణ పేదలసంఘం, బంజారా సేవాసంఘం, ఉపాధ్యాయ సంఘాలు, టీఆర్ ఎస్ నాయకులు మద్ధతు పలికారు. ప్రజా సంఘాల నాయకులు నేతావత్‌రాందాస్, బానోతు రామారావు, పవర్‌దేవిదాస్, భరత్ చౌహాన్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం సీఆర్టీల న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని పట్టు భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సివిల్ సప్లయి మాజీచైర్మన్ రవీందర్‌సింగ్ కోరారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం సీఆర్టీలకు భోజనసౌకర్యం నిమిత్తం పదివేల రూపాయలు చెక్కు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్రాజైవంత్‌రావు, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్, సాజిద్ తదితరులున్నారు.

'సర్వేలతో ప్రభుత్వం కాలయాపన'

తలమడుగు , డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక సర్వేల పేరిట కాలయాపన చేస్తుం దని బోథ్‌ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు మంగళవారం మండలంలోని బరంపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్ని కల సమయంలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి, అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం సర్వేల పేరిట ప్రజలను మోసం చేయడమే తప్ప ఏడాదిలో చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, జిల్లా నాయకులు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, రమాకాంత్, రంజిత్ రెడ్డి, మోటే కిరణ్ కుమార్, పిడుగు అభిరామ్ రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరా మర్శించారు. వీరి వెంట మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ పెంటరమణ, ఉపసర్పంచ్ దేవేంద ర్‌రెడ్డి, సురేందర్, సోమేశ్ పాల్గొన్నారు.